క్లుప్తంగా

కాచాపూర్‌లో రైతుల సంబురాలు



భిక్కనూరు : మండలంలోని కాచాపూర్‌లో నూతన సొసైటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం సంబురాలు జరుపుకొన్నారు. స్థానిక సింగిల్‌విండో వద్ద బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తొగరి మురళి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తన హయాంలో అప్పటి సీఎం కేసీఆర్‌కు కాచాపూర్ సింగిల్‌విండో ఏర్పాటుకు విన్నవించగా ఆయన స్పందించి ఉత్తర్వులు జారీ చేసినప్పటికి ఎన్నికల కోడ్‌ల దృష్ట్యా అములుకునోచుకోలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మురళి, నందం, సిద్దాగౌడ్, డాక్టర్ రాజిరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు సుల్తాన, భాగ్య పాల్గొన్నారు.

ఆసరా కోసం నిరీక్షణ



నిజాంసాగర్(జుక్కల్) : ప్రతీనెల మొదటి వారంలో ఆసరా పింఛన్లు అందుకునే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ జీపీ కార్యాలయం వద్ద ఆసరా పింఛన్ లబ్ధిదారులు పడిగాపులు కాశారు. ఈ నెలాఖరు వరకు ఆసరా డబ్బులు పంపిణీ చేయకపోవడంతో పోస్టాఫీసులు, జీపీల వద్ద వారు దర్శనమిస్తున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని మదర్సా విద్యార్థులకు మంగళవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. విషజ్వరాలు విజృంభిస్తున్న దృశ్యా విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం నౌశిన్, ఆశ వర్కర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో మంగళవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 41 జీపీలకు బీజేపీ ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజక వర్గ ఇన్‌చార్జి బాపిరెడ్డి, రాష్ట్ర నాయకులు లింగారావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు దత్తురాం ఉన్నారు.

విద్యార్థి సంఘం నేతకు నివాళి



బాన్సువాడ : బీసీ విద్యార్థి సంఘం నేత ప్రవీణ్‌గౌడ్‌కు మంగళవారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళి నిర్వహించారు. ప్రవీణ్‌గౌడ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేసిన ఉద్యమ నేత ప్రవీణ్‌గౌడ్ మరణించడం బాధ కరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ కళాశాల ప్రిన్సిపల్ మైశయ్య, ఏబీవీపీ మాజీ రాష్ట్ర నాయకులు కోనాల గంగారెడ్డి, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షులు బాల్‌రాజ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు భాస్కర్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



రామారెడ్డి : పోసానిపేట ప్రాథమిక పాఠశాలలో గతంలో ఉపాధ్యాయులుగా పనిచేసిన బ్రహ్మం, రాజయ్య, ప్రవళిక, జ్యోత్స్నకు మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈవో యోసెఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమేనన్నారు. శ్రీనివాస్, శివ కృష్ణ,రమేష్, వీడీసీ సభ్యులు నర్సింలు తదితరులున్నారు.

బోరు తవ్వకం ప్రారంభం

కామారెడ్డి టౌన్ : మున్సిపల్‌పరిధిలోని దేవునిపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద బోరుమోటారు తవ్వకం పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ మంగళవారం ప్రారంభించారు. కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కాలనీల్లో మురికి కష్టాలు..

- చిన్నపాటి వర్షాలకే కుంటలను తలపిస్తున్న కాలనీలు
- నీరు నిలువ ఉండడంతో దోమల వ్యాప్తి
- సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడమే కారణం



బీబీపేటలోని ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

బీబీపేట : చిన్నపాటి చినుకు పడితే చాలు కాలనీల్లో వర్షం నీరు నిల్వ ఉండి ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. కాలనీల్లో గుంతలు ఏర్పడి వాటిలో వర్షం నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది కాలనీవాసులకు అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. బీబీపేట మండల కేంద్రంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ, సరైన సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రతి వర్షాకాలం సీజన్లో ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. కొన్ని కాలనీల్లో సీసీలు, డ్రెయినేజీలు నిర్మాణం అయినప్పటికీ మరికొన్ని అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో రోడ్లలో గుంతలు ఏర్పడి వర్షం నీరు నిల్వ ఉంటుంది. బీబీపేటలోని ప్రధానంగా ఇంద్రానగర్ కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడం, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా మండల కేంద్రానికి ప్రధాన కార్యాలయాలు అయినటువంటి తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, రైతులకు అవసరమైనటువంటి సహకార సంఘం, గోదాం వద్దకు వెళ్లాలంటే ప్రజలు బురదలో అడుగు వేయక తప్పడం లేదు. ప్రధాన రోడ్డు నుండి కార్యాలయాల వద్దకు వెళ్లాలంటే బురదలో నుండి నడవాల్సిందే. ఆస్పత్రికి వెళ్లాల్సిన రోగులు సైతం గుంతలు ఉండడం, వాటిలో వర్షం నీరు ఉండడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ప్రధానంగా ఎరువుల కోసం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనాలపై ఎరువులను తీసుకువచ్చే క్రమంలో చాలా మంది అదుపు తప్పి బురదలో పడ్డారు. గతంలో సీసీ రోడ్డుకోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆచరణలోకి రాలేదు. దీంతో నిత్యం అధికారులు, ప్రజలు, రైతులు బురదలో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

గ్రామంలో ఎస్సీ కాలనీలోని పోచమ్మ ఆలయం వద్ద నుండి ప్రధాన రోడ్డుకు వెళ్లాలంటే సుమారు పదుల సంఖ్యలో గుంతలు దాటి వెళ్లాల్సిన పరిస్థితి. అంతేకాకుండా ముదిరాజ్ వార్డు, రెడ్డి వార్డు, మున్నూరు కాపు వార్డుల్లో కూడా సీసీలు లేకపోవడంతో వర్షం నీరు అక్కడ ఉన్నటువంటి గుంతల్లో నిండి ఉంటుంది. దీంతో అక్కడి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు రోగాల బారిన పడుతున్నారు. అసలే వర్షాకాలం సీజన్ కావడంతో ప్రధానమైన డెంగీ, కలరా, టైఫాయిడ్, హెపటైటీస్, అతిసార, మలేరియా వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కాలువలు నిర్మించాలి



బీబీపేట రాను రాను జనాభా పరంగా ఎక్కువగా విస్తరించడంతో దానికి అనుగుణంగా వసతులు లేకుండా పోయింది. చాలా కాలనీల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. వర్షాకాలం సీజన్ కావడంతో రోగాలు ప్రబలుతున్నాయి. సంబంధిత అధికారులు గుంతలను గుర్తించి మొరం పోయడం, గుంతల్లో దోమలు రాకుండా మందులు పిచికారి చేయడం లాంటివి చేయాలి.

– రంజిత్ గౌడ్, బీబీపేట

అక్రమ కేసులు ఎత్తివేయాలి

మాచారెడ్డి : మండలంలోని ఎల్లంపేట, నడిమి తండాకు చెందిన పలువురు పోడు రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పలువురు పోడు రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు లింబ్యా నాయక్, నరహరి, మాన్సింగ్ తదితరులున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి



మాచారెడ్డి : పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించా లని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో పర్యటిస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమా న్ని చేపట్టారు. రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణం జిల్లా ఉపాధ్యక్షులు రూప్సింగ్, నరేందర్ ఉన్నారు.

నోడల్ అధికారికి సన్మానం



బాన్సువాడ : బాన్సువాడ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా నోడల్ అధికారి సలాం తనిఖీ చేశారు. రికార్డులను, తరగతి గదులను పరిశీలించారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలన్నారు. నోడల్ అధికారిని కళాశాల అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపల్ అసద్ షారుఖ్, అధ్యాపక బృందం ఉన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం బాన్సువాడ ఆర్డీవో రమేశ్ రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ధర్మారం వద్ద పెట్రోల్ బంక్ స్థలంను పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ, అర్‌ఐ శీతల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



రాజంపేట : నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి తెలిపారు. గుండారం, ఎల్లారెడ్డి పల్లి, ఆర్గొండ, బస్వన్నపల్లి, కొండాపూర్, అన్నారం, అన్నారం తండాలకు చెందిన 17 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అంజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భీమరి శ్యామయ్య, మాశెట్టి శ్రీధర్, సెక్రటరీ సంజీవ రెడ్డి, మండల నాయకులు బీరయ్య, సభకర్ రెడ్డి, సుభాష్ నాయక్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో 8 మండలాల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూంపల్లి సందర్శన



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని భూంపల్లిలో విషజ్వరాలు ప్రబలడంతో ఇద్దరు చిన్నారులు మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో గ్రామంలో సదాశివనగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారి శ్రీధర్ రెడ్డి పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ఆస్మా, ఆశ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : రైతులు పంట రుణమాఫీ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని ఏడీఏ ప్రసన్నలక్ష్మి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో రైతులతో మాట్లాడారు. రుణమాఫీ విషయమై రైతుల నుంచి గ్రీవెన్స్‌ను తీసుకుంటున్నామన్నారు. అనంతరం తిర్మన్‌పల్లిలో పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రజాపతి, ఏఈవో కవిత, రైతులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై విచారణ

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్‌లో మంగళవారం గ్రామ, మండల పరిషత్, రెవెన్యూ అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ విచారణ చేపట్టారు. సంగవ్వ ప్లాట్ ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. సదరు ప్లాట్ హక్కు కల్పిస్తూ అనుమతులిచ్చారు. మండల పంచాయతీ అధికారిణి అనిత, గిర్దావర్ అంజయ్య జీపీ కార్యదర్శి ఉన్నారు.

కామిశెట్టి పల్లిలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని కామిశెట్టి పల్లి గ్రామంలో మంగళవారం ఎంపీవో సూర్యకాంత్, గిర్దావార్ అంజు సంయుక్తంగా కలిసి సర్వే చేపట్టారు. గతంలో రూ.1000 చెల్లించి లేఅవుట్ లేని భూములు కొనుగోలు చేసిన వారి భూములను సర్వే చేశామన్నారు.



విచారణ చేపడుతున్న అధికారులు

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాడ్వాయి మండల కేంద్రంలో మినీస్టేడియం నిర్మాణం పనులను చేపట్టాలని కోరారు. మద్ది మహేందర్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, శ్యాంరావు, సంజీవులు, మేకల రాజు మరికొందరు కలిసిన వారిలో ఉన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. బ్యాంక్ రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఎజెండా అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, సీసీలు రాములు తదితరులున్నారు.

వైభవంగా గోకులాష్టమి వేడుకలు



గాంధారిలో ఉట్టికొడుతున్న యువకులు



గోపాల్‌పేటలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో గోకులాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ఉట్టికొట్టి సంబురాలు చేశారు.



సదాశివనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో భజనలు



భూంపల్లిలో ఉట్టి కొడుతున్న గ్రామస్తులు



పోచారం తండాలో ఉట్టికి గ్రామస్తుల పూజలు



సదాశివనగర్‌లో చిన్నికృష్ణుడి వేషధారణలో..



బీబీపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో..



జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణధ్యాన మందిర్‌లో..

విషజ్వరాలు ప్రబలకుండా చూడాలి



బిచ్కుంద(జుక్కల్) : ఆయా మండలాల్లో విషజ్వరాలు ప్రబలకుండా స్థానిక అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మండల తహసీల్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ స్థానిక అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ధరణి, డెంగీ, ఇంటింటికి ఓటరు సర్వే, ఎల్‌ఆర్‌ఎస్ తదితర అంశాలపై టెలికాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రవిందర్, ఎంపీవో అబ్బాగౌడ్, ఎంపీడీవో గోపాల్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాగృతి ఆధ్వర్యంలో పూజలు



కామారెడ్డి అర్బన్ : జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినందుకు జాగృతి నాయకులు మంగళవారం వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శనం చేసుకుని మొక్కు తీర్చుకున్నామని సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చిట్టిమల్ల అనంతరాములు నాయకులు చక్రధర్, రమణరావులు తెలిపారు. మంగళవారం బెయిల్ ప్రకటన రాగానే తాము సిరిసిల్ల బీజేఎస్ మాజీ అధ్యక్షుడు నాగేందర్‌రావుతో కలిసి శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నామన్నారు.

ఆధ్యాత్మికం

ఇష్టకార్యసిద్ధి అంజన్నకు శ్రావణ పూజలు



కామారెడ్డి అర్బన్ : శ్రావణ చివరి మంగళవారం సందర్భంగా స్థానిక ఆర్‌బీనగర్ ఇష్టకార్య సిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ నాయకులు బాలకిషన్, చారి, రమేష్, నీల రాజు, ఆలయ అర్చకులు సూర్యకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వరుడి రకరకాల పూలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పాలాభిషేం, జలాభిషేకం చేశారు.

దోమకొండలో..



దోమకొండ : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి కల్యాణం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సందెల అబ్బయ్య, సిద్దరాములు, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాజీ ఎంపీపీ కానుగంటి శారద, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్కి ఆలయంలో అన్నదానం

కామారెడ్డి అర్బన్ : స్థానిక పరంజ్యోతి భగవతిభగవాన్ కల్కి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. దాతలు చిలువేరు రాజశేఖర్-లత దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించారు. ప్రతి మంగళవారం నిర్వహించే అన్నదానంలో భాగస్వామ్యం అయ్యేవారు ఆలయంలో సంప్రదించాలన్నారు.

హనుమాన్ ఆలయంలో రుద్రహోమం



పిట్లం(జుక్కల్) : పోతిరెడ్డిపల్లి తండా హనుమాన్ ఆలయంలో ఆలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం భక్తులు ఆంజనేయస్వామికి పాల పంచామృత అభిషేకం, 16,000 తమల పాకులతో అర్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు తేజ గురు స్వామి, అర్చకుడు సురేష్ శర్మ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి హోమం



రామారెడ్డి : ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి ఆలయంలో బహులాష్టమి సందర్భంగా భక్తుల సమక్షంలో హోమం నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. బహులాష్టమి సందర్భంగా భైరవ హోమంలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభుగుప్తా, ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ, వంశీకృష్ణ శర్మ పాల్గొన్నారు.

సంక్షిప్తం

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

బీబీపేట : కొద్ది నెలల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ ద్వారా ట్రేస్‌చేసి ఇద్దరు బాధితులకు మంగళవారం ఎస్సై ప్రభాకర్ అందజేశారు. మండలంలోని యాడారం గ్రామానికి చెందిన రావర్తి ఎల్లయ్య, మందాపూర్‌నకు చెందిన పిట్ల రమేశ్‌ల ఫోన్లను ట్రేస్ చేసి వారికి అందజేశారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలోని 14 విశ్వ విద్యాలయాల్లో కొనేళ్లుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న 1445 మంది అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయం కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రతినిధులు మాధవి, సురేందర్, శ్రీనివాస్, శరత్, శైలజ, స్వాతి తదితరులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 2205 పోస్టుల్లో కొనేళ్లుగా పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు 1445 మంది ఉన్నారని, వీరందరికి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్కేల్‌లో ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

కూలిపోయిన కంపోస్ట్ షెడ్



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని బురుగుపల్లి శివారులో నిర్మాంచిన కంపోస్ట్‌షెడ్ పూర్తిగా కూలిపోయింది. గత ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి వైకుంఠదామంతో పాటు కంపోస్ట్ షెడ్ నిర్మాణం చేపట్టింది.

విద్యార్థులకు కంటి పరీక్షలు

భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కంటి వైద్యుడు రవీందర్ పటేల్ మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. 256 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు అందజేశారు.

బీర్కూర్‌లో..

బాన్సువాడ : లయన్స్ క్లబ్ ఆఫ్ బీర్కూర్ ఆధ్వర్యంలో మంగళవారం బీర్కూర్ లయన్స్ భవనంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 18 మందికి కంటి పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు మేకల గాలయ్య, కోశాధికారి రమేశ్, సభ్యులు కొట్టూరి సంతోష్ వైద్యులు సతీష్ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బీబీపేట : చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీపీ కార్యదర్శి రమేశ్ అన్నారు. మంగళవారం గ్రామంలోని పలు కాలనీల్లో దోమల మందును స్ప్రే చేశారు. మురికి కాలువల్లో, నిల్వ ఉన్న నీటిలో స్ప్రే చేయించారు. ఇంటి ఆవరణలో చెత్తాచెదారం వేయకుండా ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని ప్రజలకు సూచించారు. కారోబార్ సిద్దరాంలు, సిబ్బంది ఉన్నారు.

ఎస్సైకి సన్మానం

రాజంపేట : ఇటీవల రాజంపేట ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై పుష్పరాజ్‌ను మంగళవారం పెద్దాయిపల్లి గ్రామానికి చెందిన కామిశెట్టి శ్రీనివాస్, అశోక్ శాలువతో సత్కరించారు.